# ప్రశ్నించే గొంతులపై కేసుల కత్తి

**ఉద్యమ దివిటీ 'నమస్తే తెలంగాణ'పై సర్కారు కక్ష**

- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు
- స్వతంత్ర జర్నలిస్టులపై వరస కేసుల బనాయింపు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఏ జర్నలిస్టునూ రేవంత్ సర్కారు వదలడం లేదు. ఎక్కడికక్కడే కేసులు నమోదు చేసి, అర్ధరాత్రి అపరాత్రి అని తేడా లేకుండా అరెస్టు చేయిస్తున్నది. ఏకంగా బెడ్రూంలోకి దూరి మరీ.. కట్టుబట్టలతో తీసుకొచ్చి ఠాణాల్లో బంధిస్తున్నది. నాడు న్యూస్‌లైన్ శంకర్.. మొన్న సరిత, విజయారెడ్డి, శివారెడ్డి.. నిన్న రేవతి, తన్వీయాదవ్.. నేడు మళ్లీ అదే న్యూస్‌లైన్ శంకర్ ఇలా చెప్పుకొంటూ పోతే పదుల సంఖ్యలో జర్నలిస్టులపై సర్కారు కేసులు బనాయించింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడమే వీరు చేసిన పాపమైంది. అందుకే నేటికీ అక్రమ కేసుల కారణంగా న్యూస్‌లైన్ శంకర్ చంచల్‌గూడ జైలులోనే మగ్గుతున్నాడు. ఈ ఇండిపెండెంట్ జర్నలిస్టులతోపాటు ప్రభుత్వానికి కొరగాని కొయ్యలా మారిన ఉద్యమ పత్రిక నమస్తే తెలంగాణ విలేకరులపైనా ఎక్కడికక్కడ కేసులు నమోదవుతున్నాయి.

**తొలినుంచీ 'నమస్తే తెలంగాణ'పై కన్ను**

పోలీసుల అక్రమాలను బయటపెట్టినందుకు మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల 'నమస్తే తెలంగాణ' విలేకరి కొండా సతీశ్‌పై అక్రమ కేసులు నమోదు చేసి, మానుకోటలోని సబ్ జైలుకు తరలించారు. నిజాన్ని నిర్భయంగా పత్రికల్లో రాసే రిపోర్టర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం పరిపాటిగా మారింది. పెద్దవంగర పోలీస్ స్టేషన్‌లో బయట వ్యక్తులతో పోలీసులు కలిసి మందు పార్టీ చేసుకున్నారని సతీశ్ వెలుగులోకి తేగా డీజీపీ స్పందించి ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. దీంతో కక్షసాధింపు చర్యగా సతీశ్ పైనే ఉల్టా కేసులు పెట్టి జైలుకు పంపారు. వేములవాడలో కోడెల కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చినందుకు నమస్తే తెలంగాణ విలేకరి స్నేహితుడి హాస్పిటల్‌ను సీజ్ చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల 'నమస్తే తెలంగాణ' రిపోర్టర్ వీ సత్యనారాయణ.. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువకావడం లేదంటూ వరస కథనాలు రాస్తుండడాన్ని దృష్టిలో పెట్టుకొని నంనూర్ పంచాయతీ కార్యదర్శితో బెదిరింపుల కేసు పెట్టించారు. బీఎన్ఎస్ 132, 292, 351(2),ఆర్/డబ్ల్యూ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీటికి తోడు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు మెరుగైన సమాచారాన్ని చేరవేస్తున్న 'నమస్తే తెలంగాణ' కేంద్ర కార్యాలయానికి ప్రత్యేకించి ప్రతిరోజూ రిజాయిండర్ రావడం పరిపాటిగా మారింది.

**కరెంటు లేదని ప్రశ్నించినందుకు..**

రేవతి అనే స్వతంత్ర జర్నలిస్టు నిరుడు జూన్ 18న తరచూ విద్యుత్తు అంతరాయాలు ఎదుర్కొంటున్నట్టు ఎక్స్‌లో పోస్టు చేసింది. దీంతో ఆమె ఉంటున్న ఏరియాకు వచ్చిన లైన్‌మన్.. ఆమెను ఆ పోస్టు తీసేయాలని బెదిరించాడు. ఈ ఘటనతో ప్రభుత్వం మరింత సీరియస్ అయింది. ఎక్స్‌లో పోస్టు పెట్టిన రేవతిపైనే 2024, జూన్ 19న క్రైమ్ నంబర్ 662/2024 కింద ఐపీసీ సెక్షన్ 505 (ప్రజా దుష్ప్రవర్తన) ఐటీ చట్టంలోని సెక్షన్ 66 (డి) (వ్యక్తిగతంగా మోసం చేయడం) వంటి వాటిపై కేసు నమోదు చేయించింది. ఇటీవల ఓ రైతు తన భూమిని ప్రభుత్వం అన్యాయంగా లాక్కోవడంపై యూట్యూబ్ వేదికగా తన బాధను వెళ్లగక్కాడు. దీంతో ఆ వీడియో పోస్టు చేసిన జర్నలిస్టు రేవతి, తన్వీ యాదవ్‌లపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపారు.

**ఇద్దరు మహిళా జర్నలిస్టులపై దాడి..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో రుణమాఫీపై స్వతంత్ర జర్నలిస్టులు సరితా యాదవ్, విజయారెడ్డి రైతులతో మాట్లాడుతుండగా కొందరు కాంగ్రెస్ గూండాలు దౌర్జన్యం చేసి, ఫోన్లు, కెమెరాలు లాక్కుని దాడికి పాల్పడ్డారు. వారు రక్షణ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తుంటే కార్లలో మారణాయుధాలతో వెంబడించి, దాడికి ప్రయత్నించారు. సాక్షాత్తూ పోలీసులే చేష్టలుడిగి చూస్తుండగా పోలీస్ స్టేషన్ బయట కార్లలో కాపుకాసి హత్యకు ప్రయత్నించారు. సాక్షాత్తూ సీఎం స్వగ్రామంలోనే పట్టపగలే ఇదంతా జరిగింది. విషయం పోలీస్ స్టేషన్‌కు చేరాక కూడా వారిపై వేధింపులు ఆగలేదు.


**స్వతంత్ర జర్నలిస్టులపై కేసుల వివరాలు..**

| పేరు | చానల్ | కేసులు |
|---|---|---|
| శంకర్ | న్యూస్ లైన్ తెలుగు | 18 |
| ఆకుల శ్రీనివాస్‌రెడ్డి | టీఎస్ 24 న్యూస్ తెలుగు | 5 |
| శివారెడ్డి | సిగ్నల్ టీవీ | 3 |
| చిలుక ప్రవీణ్ | యూ న్యూస్ | 3 |
| సరిత యాదవ్ | తెలుగు స్క్రైబ్/ఆధ్య టీవీ | 2 |
| విజయారెడ్డి | మిర్రర్ టీవీ | 2 |
| రాజ్‌కుమార్ | ఆర్జీ టీవీ | 2 |
| రేవతి | పల్స్ న్యూస్ తెలుగు | 2 |
| యారా రంజిత్‌రెడ్డి | వైఆర్ టీవీ | 1 |
| తన్వీ యాదవ్ | పల్స్ న్యూస్ తెలుగు | 1 |

**శంకర్, శివారెడ్డి, చిలుక ప్రవీణ్ బాధితులే**

ప్రజలపక్షాన నిలబడినందుకు, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకు అక్రమకేసులు ఎదుర్కొంటున్న వారిలో న్యూస్‌లైన్ శంకర్, సిగ్నల్ టీవీ శివారెడ్డి, చిలుక ప్రవీణ్, గౌతమ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, రంజిత్‌రెడ్డి వంటివారు ముందు వరసలో ఉన్నారు. వీరిపై ఇప్పటికే కొన్నిసార్లు హత్యాయత్నం కూడా జరిగింది. అయినా నిజాన్ని నిర్భయంగా చెప్పడంలో ఎంతోమంది జర్నలిస్టులకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ నేపథ్యంలోనే న్యూస్‌లైన్ శంకర్‌పై ఇప్పటి వరకు 18 అక్రమ కేసులను ప్రభుత్వం పెట్టించింది. నిరుడు ఆఫీస్ ముందే శంకర్‌పై హత్యాయత్నం జరిగింది. ఆ తర్వాత కొండారెడ్డి పల్లి వెళితే మరోసారి హత్యాప్రయత్నం జరిగింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు, న్యూస్‌లైన్ ద్వారా లైవ్‌లో వాస్తవాలు వెలుగులోకి తెస్తున్నందుకు, 'తెలంగాణం' పత్రికలో నిజాలు చెప్తున్నందుకు కుట్రలు పన్నిన కాంగ్రెస్ నేతలు కేసులు పెట్టారు. మరో జర్నలిస్టు చిలుక ప్రవీణ్‌పైనా ఇప్పటికే రెండు సార్లు హత్యాప్రయత్నం జరిగింది.







"ఒకరిద్దరు జర్నలిస్టులను కాదు.. పదుల సంఖ్యలో జర్నలిస్టులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులతో వేధిస్తున్నది. ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్నందుకే ఇండిపెండెంట్ జర్నలిస్టులపై రేవంత్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కుతున్నారు.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హెచ్‌సీయూ అంశాన్ని కవర్ చేసినందుకు..**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని నిరసిసూ విద్యార్థులు ఆందోళన చేపట్టడంతో ఆ వార్తలను 'సౌత్‌ఫస్ట్' జర్నలిస్టు సుమిత్ కవర్ చేసేందుకు వెళ్లాడు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అడవిని నరికివేయొద్దని, 400 ఎకరాల భూముల వేలాన్ని ఆపాలని విద్యార్థులు ధర్నాలు చేస్తుంటే ఆ వార్తలను కవర్ చేస్తున్న సుమిత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తాను జర్నలిస్టునని చెప్పినా వినకుండా అదుపులోకి తీసుకున్నారు. దీంతో జాతీయస్థాయిలో రేవంత్‌రెడ్డి సర్కారుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. 'తెలంగాణలో పోలీసుల అతిక్రమణ ఆందోళనకరంగా ఉన్నది. జర్నలిస్టులను అదుపులోకి తీసుకుంటున్నారు. భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న గొంతులను అరెస్టులతో మూసేస్తున్నారు. స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, భావవ్యక్తీకరణను బహిరంగంగా అణచివేయడం ఆమోదయోగ్యం కాదు. ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం విషయంలో మీ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు చాలా బాధాకరంగా ఉన్నాయి రాహుల్ గాంధీ' అని ఎక్స్ వేదికగా పోస్టులు వెల్లువెత్తాయి.

## స్లాట్ బుక్ చేస్తేనే రిజిస్ట్రేషన్

**రేపటి నుంచి రిజిస్ట్రేషన్లలో నూతన విధానం : పొంగులేటి**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): ఇండ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో గురువారం నుంచి నూతన విధానం అమల్లోకి రానుంది. ఇకపై స్లాట్ బుక్ చేస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుంది. ఈ మేరకు రిజిస్ట్రేషన్లలో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్టు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తొలిదశలో గురువారం నుంచి 22 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 10న నుంచి అమలు చేయనున్నట్టు ప్రకటించారు. రోజూ 48 స్లాట్స్ మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. రద్దీ ఎక్కువ ఉండే చోట అదనంగా మరో సబ్ రిజిస్ట్రార్‌ను నియమించనున్నట్టు తెలిపారు. ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. ఒకవేళ స్లాట్ బుక్ చేసుకోనివారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఐదు వాక్ ఇన్‌రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తారని తెలిపారు.

## 'బిగ్' టీవీకి ఏపీ సర్కారు కానుక

- పథకాల ప్రసారానికి రూ.59 లక్షలు
- ప్రభుత్వ తీరుపై విమర్శల వెల్లువ

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న 'బిగ్' టీవీకి ఏపీ ప్రభుత్వం కానుక ఇచ్చింది. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించే కార్యక్రమాల రూపకల్పన, ప్రసారానికి రూ.59 లక్షలు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం జీవో ఆర్టీ నంబర్ 665 జారీచేసింది. 'ప్రవాస మీడియా ఎల్ఎల్‌పీ- బిగ్ టీవీ)కి రూ.59 లక్షలు విడుదల చేస్తున్నట్టు జీవోలో పేర్కొన్నారు.

**ఆరోపణల వెల్లువ**

ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనుసన్నల్లో నడిచే 'బిగ్' టీవీకి రూ.59 లక్షలు విడుదల చేయడం వివాదాస్పదమవుతున్నది. బిగ్ టీవీ కి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పథకాల ప్రసారం ముసుగులో ఈ నిధులు ఇవ్వడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ ప్రభుత్వ వైఖరిపై అక్కడి ప్రతిపక్ష నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## ఉద్యానవన పంటల సాగు పెరగాలి

**రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచన**



హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులకు సూచించారు. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని గడ్డమల్లయ్య గూడెం, మొండి గౌరెల్లి, దరిగూడ గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని నిర్ణయించారు. మంగళవారం రైతు కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు.

## మద్యపాన పర్యాటకం!

- బార్ అండ్ రెస్టారెంట్స్‌గా హరిత హోటళ్లు
- సర్కారుకు పర్యాటకశాఖ కొత్త ప్రతిపాదనలు
- ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలోనే నిర్వహణ చేసేలా యోచన
- లీజు రూపంలో అనుయాయులకు కట్టబెట్టే పన్నాగం?

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): పర్యాటకశాఖ ఆధీనంలోని హరిత హోటళ్లను బార్ అండ్ రెస్టారెంట్లుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధంచేసింది. ప్రభుత్వం ప్రకటించిన కొత్త టూరిజం పాలసీలో పర్యాటకులకు మద్యాన్ని సరఫరా చేసేందుకు సమాయత్తమవుతున్నది. పర్యాటకశాఖ ఆలోచనతో మరిన్ని సమస్యలు తప్పవని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**అమ్మకాల పెంపే పరమావధి**

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సందర్శనకు వెళ్లే పర్యాటకుల వసతి కోసం బీఆర్ఎస్ హయాంలో హరిత హోటళ్లను నిర్మించింది. కానీ, వాటిని బార్ అండ్ రెస్టారెంట్లుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే గోల్కొండ సమీపంలోని తారామతి బరాదరి, బేగంపేట టూరిజం ప్లాజాలో బార్‌అండ్ రెస్టారెంట్ సేవలను ప్రారంభించింది. ఈగలపెంట, సోమశిల, మన్ననూరు, మేడారం, తాడ్వాయి, బొగత తదితర ప్రాంతాల్లోని హరిత హోటళ్లలోనూ మద్యం సరఫరా కోసం ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది.

**లీజు రూపంలో అనుచరులకు లబ్ధి?**

హరిత హోటళ్లకు ఆశించిన స్థాయిలో డిమాండ్ ఉండటం లేదనేది ప్రభుత్వం చెప్తున్నది. ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే, నిర్వహణ నష్టాల నుంచి బయటపడటంతోపాటు అదనంగా ఆదాయం సమకూరుతుందని అధికారులు వెల్లడించారు. కానీ ప్రభుత్వంలోని కీలక హోదాల్లో ఉన్న నేతలు హోటళ్లను అనుకూలమైన వ్యక్తులకు, అనుచరులకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని తెలుస్తున్నది. కొందరికి లబ్ధి కలిగించేందుకే కొందరు పెద్దలు ఈ ఎత్తుగడ వేశారని విమర్శలు వినిపిస్తున్నాయి.

## కర్రెగుట్టపై బాంబులు అమర్చాం!

- ప్రజలెవరూ అటువైపు రావొద్దు
- లేఖలో హెచ్చరించిన మావోయిస్ట్ పార్టీ నేత శాంత

చర్ల/వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 8 : ఆపరేషన్ కగార్ దాడి నుంచి రక్షణ పొందేందుకు ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) కర్రెగుట్టపై బాంబులు అమర్చినట్టు మావోయిస్టు పార్టీ వాజేడు-వెంకటాపురం ఏరియా కార్యదర్శి శాంత తెలిపారు. అయినప్పటికీ కొందరు వ్యక్తులు పోలీసుల మాటలు నమ్మి, డబ్బుకు ఆశపడి ఇన్‌ఫార్మర్లుగా మారి షికారు పేరుతో గుట్టవైపు వస్తున్నారని మంగళవారం విడుదల చేసిన లేఖలో ఆమె పేర్కొన్నారు. తమ రక్షణ కోసం అమర్చిన బాంబుల వల్ల ఇతరులు గాయపడుతున్నారని, పోలీసుల మాటలు నమ్మి ఎవరూ ఇటువైపు రావొద్దని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని, ప్రజల సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు.

## బార్లకూ టెండర్లు పిలవండి!

- ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నం
- బార్, రెస్టారెంట్ల యజమానుల ఆరోపణల్లో వాస్తవం లేదు
- వాళ్లకూ రెండేండ్లకోసారి లైసెన్సులు ఇవ్వాలి
- పలు బార్, రెస్టారెంట్లలో సాగుతున్న అక్రమ దందా
- కస్టమర్లకు విడిగా అమ్ముతున్న మద్యం అమ్మకాలు
- తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ తీవ్ర ఆగ్రహం




మాట్లాడుతున్న తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ వెంకటేశ్వరరావు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని బార్, రెస్టారెంట్లకూ ప్రతి రెండేండ్లకు ఒకసారి టెండర్ పద్ధతిలోనే లైసెన్సులు మంజూరు చేయాలని, దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరుతుందని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సూచించారు. వైన్ షాపులకు రెండేండ్లకోసారి టెండర్ పద్ధతిలో లైసెన్సులు తీసుకోవడం వల్ల ప్రభుత్వానికి 87 శాతం ఆదాయం వస్తుంటే, బార్, రెస్టారెంట్ల ద్వారా కేవలం 15శాతం లోపు ఆదాయమే వస్తుందని తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు డీ వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. మద్యం షాపుల యజమానులపై, పర్మిట్ రూమ్‌లు, సమయం కుదింపుపై బార్, రెస్టారెంట్స్ అసోసియేషన్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పారు. జిల్లాల్లో 10 గంటలకు మద్యం షాపులు మూసివేసినట్టే నగరాల్లో కూడా 10 గంటలకే మద్యం దుకాణాలను మూసివేయాలనడం అవివేకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో బార్లు అర్ధరాత్రి 12 గంటల వరకు నడుస్తున్నా తామేమీ అభ్యంతరం చెప్పడం లేదని తెలిపారు. ఎందుకు తమ దుకాణాల వేళలను తగ్గించాలని రోడ్డెక్కుతున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే పర్మిట్ రూమ్‌లను నిర్వహిస్తున్నామని, అక్కడ 'రెడీ టు ఈట్' పదార్థాలు మినహా వారు చెప్తున్నట్టు భారీ సిట్టింగ్‌లు ఏమీ లేవని తెలిపారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయిస్తుండటంతో ఎంతోమంది కస్టమర్లు పర్మిట్ రూమ్‌లనే ఇష్టపడుతున్నారని, 2010 నుంచి ఉన్న ఈ నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేయడం తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. ప్రస్తుతం స్పెషల్ ఎక్సైజ్ ట్యాక్స్ కింద పర్మిట్ రూమ్‌కు రూ.5 లక్షలు చెల్లిస్తున్నామని చెప్పారు.

**బార్లలో అక్రమంగా మద్యం అమ్మకాలు**

రాష్ట్రంలోని కొన్ని బార్, రెస్టారెంట్లలో వినియోగదారులకు అక్రమంగా రిటైల్ మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారని డీ వెంకటేశ్వరరావు ఆరోపించారు. బార్, రెస్టారెంట్ల సమయాన్ని 11 గంటలకు పైగా పెంచడం వల్ల ఆ ప్రభావం తమపై పడుతుందని, దాని వల్ల 20 శాతం నష్టాలను చవిచూస్తున్నామని చెప్పారు. వినియోగదారులకు మద్యం పార్శిళ్లను నేరుగా అమ్మే వారిపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ కలిసి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, కోశాధికారి సుభాశ్, ఉపాధ్యక్షుడు ప్రభు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోకి 604 కొత్త మద్యం బ్రాండ్లు

- 331 ఇండియన్ బ్రాండ్స్, 273 ఫారిన్ బ్రాండ్స్
- ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న 92 కంపెనీలు
- 47 కొత్త కంపెనీల నుంచి 386 బ్రాండ్లకు దరఖాస్తులు



హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మద్యం మార్కెట్‌లో అడుగుపెట్టేందుకు 92 కంపెనీలకు చెందిన 604 కొత్త బ్రాండ్లు ఉవ్విళ్లూరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా తమ బ్రాండ్లను తెలంగాణలో విక్రయిస్తామని ఆ కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో 331 ఇండియన్ మేడ్ లిక్కర్ బ్రాండ్లు, మరో 273 రకాల విదేశీ లిక్కర్ బ్రాండ్లు ఉన్నాయి. దేశ, విదేశీ మద్యం బ్రాండ్ల కోసం టీజీబీసీఎల్ ఈ ఏడాది ఫిబ్రవరి 23న దరఖాస్తులను ఆహ్వానించిన విషయం విదితమే. ఆ నోటిఫికేషన్ మేరకు ఇప్పటికే మద్యం సరఫరా చేస్తున్న 45 కంపెనీలు 218 కొత్త రకాల మద్యం బ్రాండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. తెలంగాణలో తొలిసారి 386 రకాల కొత్త మద్యం బ్రాండ్లను ప్రవేశపెట్టేందుకు 47 కొత్త కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. లిక్కర్ కంపెనీల నుంచి మార్చి 15 వరకు దరఖాస్తులు తీసుకుంటామని తొలుత స్పష్టం చేసిన టీజీబీసీఎల్.. ఆ తర్వాత ఆ గడువును ఏప్రిల్ 2 వరకు పొడిగించింది. దీంతో ఏప్రిల్ 2 వరకు 92 కంపెనీల నుంచి 604 కొత్త మద్యం బ్రాండ్లకు దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ చెవ్వూరి హరికిరణ్ ధ్రువీకరించారు. ఈ దరఖాస్తుల పరిశీలన అనంతరం ప్రభుత్వ ఆమోదం మేరకు కొత్త బ్రాండ్లను అనుమతి ఇస్తారు.

## పోలవరంపై మాటమార్చిన ఏపీ

- జాయింట్ సర్వేకు ఏపీ ప్రభుత్వం ససేమిరా
- తెలంగాణ డిమాండ్లకు ఒప్పుకోబోమని పేచీ
- ఒక్క కిన్నెరసానిపైనే ఉమ్మడి సర్వేకి ఒప్పుకోలు
- అన్నింటికీ పాత సర్వేలున్నాయని వితండ వాదన



హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): పోలవరంపై ఏపీ ప్రభుత్వం మళ్లీ మాటమార్చింది. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌తో మన రాష్ట్రంలో ఏర్పడే ముంపు సమస్యపై సర్వే చేయించేందుకు ఏపీ ప్రభుత్వం ఎప్పటిలాగానే కొర్రీలు పెట్టింది. పోలవరం ముంపు సమస్యపై మంగళవారం హైదరాబాద్‌లో సెంట్రల్ వాటర్ కమిషన్ కార్యాలయంలో పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, గోదావరి ఇంటర్ స్టేట్ డిస్ప్యూట్స్ అధికారులు, పీపీఏ అధికారులు, ఏపీ సీఈలు తదితరులు పాల్గొన్నారు. పోలవరం రిజర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 45.72 మీటర్ల వద్ద ఉంటే తెలంగాణలో ఏర్పడే ముంపు ప్రమాదంపై తెలంగాణ అధికారులు సవివరంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇటు ఏపీ అక్రమంగా చేపడుతున్న గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పైనా అభ్యంతరాలను వివరించారు. కిన్నెరసాని నది డీమార్కేషన్, భద్రాచలం ముంపు, మణుగూరు భారజల ప్లాంట్‌కు ముప్పు, ఆరు వాగుల ప్రభావంపై జాయింట్ సర్వే చేయించాల్సిందేనని అధికారులు తేల్చిచెప్పారు. అయితే, తెలంగాణ డిమాండ్ల మేరకు జాయింట్ సర్వేకి ఒప్పుకునే ప్రసక్తే లేదని ఏపీ మరోసారి కొర్రీలు పెట్టింది. తాము పోలవరం బ్యాక్‌వాటర్‌తో కిన్నెరసాని నదిపై పడే ప్రభావంపై మాత్రమే జాయింట్ సర్వే చేయిస్తామని తెలిపింది. పాత సర్వేలు ఇప్పటికే ఉన్నాయని, ఆ సర్వేలు సరిపోతాయని మొండివాదనలకు దిగింది. ఏపీ వాదనలను కొట్టిపారేసిన పీపీఏ.. థర్డ్ పార్టీతో స్వయంగా సర్వే చేయిస్తామని స్పష్టంచేసింది.

**ఇవీ ప్రధాన డిమాండ్లు**

పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం వల్ల తెలంగాణలో ఏర్పడే ముంపు, ఆయా ప్రాంతాలకు సరిహద్దుల నిర్ధారణపై కచ్చితంగా జాయింట్ సర్వే చేయించాలని తెలంగాణ అధికారులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 954 ఎకరాల్లో ముంపు ప్రభావం ఉంటుందని స్పష్టంచేశారు. బ్యాక్‌వాటర్‌తో భద్రాచలంలో నదీ ప్రవాహ స్థాయిలను తేల్చాలని కోరారు. భద్రాచలం పట్టణంలోని 8 అవుట్ ఫాల్ రెగ్యులేటర్లు, భద్రాచలం ఆలయం వద్ద వచ్చే వరద ప్రవాహంపై అధ్యయనం చేయించాలని కోరారు. మణుగూరు భారజల కేంద్రం వద్ద ఏర్పడే ముంపునూ అధ్యయనం చేయాలని కోరారు. కిన్నెరసాని, ముర్రేడువాగు నదుల డ్రైనేజీ సమస్యపై ఎన్జీటీ ఆదేశాల మేరకు డీమార్కేషన్ చేయించాలని స్పష్టం చేశారు. మరో ఆరేడు స్థానిక వాగుల వద్ద ఏర్పడే వరద తీవ్రత, డ్రైనేజీ ప్రభావంపైనా సర్వే చేయించాలని స్పష్టంచేశారు. ఈ అంశాలకు సంబంధించి పూర్తి ఆధారాలనూ ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టుకు దిగువన 36 వాగులు వచ్చి చేరుతున్నాయని, పోలవరం బ్యాక్‌వాటర్‌తో ఆయా వాగులపై పడే ప్రభావంపై సర్వే చేయించాలని అధికారులు కోరారు. పోలవరం ముంపు ప్రభావంపై 2019లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ ఆధారంగా ఏపీ చేపడుతున్న గోదావరి బనకచర్ల (జీబీ) లింక్ ప్రాజెక్ట్‌ను ఆపాలని పీపీఏని అధికారులు కోరారు.

## డ్రగ్స్‌పై నియంత్రణ ఏదీ?

**నిఘా పెంచకపోతే చర్యలు తప్పవు • పోలీస్ అధికారులపై డీజీపీ సీరియస్**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోకి వచ్చే డ్రగ్స్‌ను కట్టడి చేయడంలో పోలీసు అధికారులు చురుకైన పాత్ర పోషించాలని డీజీపీ జితేందర్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో జిల్లాల ఎస్పీలు, సీపీలతో అర్ధవార్షిక నేర సమీక్షను మంగళవారం కొనసాగించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అధికారులు ఇలానే స్తబ్ధుగా పనిచేస్తే.. డ్రగ్స్‌ను ఎప్పటికి నియంత్రిస్తారని ప్రశ్నించారు. డ్రగ్స్ విషయంలో ఇప్పటికే స్పష్టమైన సూచనలు ఇచ్చామని, వాటిని ఎస్పీలు, సీపీలు కఠినంగా అమలు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆదేశాలు జారీచేశారు. స్థానికులతో మమేకమై.. అనుమానాస్పద ప్రాంతాల్లో నిఘా పెంచాలని సూచించారు. ముఖ్యంగా విద్యాసంస్థలలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. వ్యవస్థీకృత నేరాలను ముందే పసిగట్టాలని డీజీపీ చెప్పారు. కొత్తగా నమోదైన నేరాల ధోరణులపై సీఐడీ డీజీ శిఖా గోయల్ వివరణ ఇచ్చారు.

**శాంతిభద్రతలే ముఖ్యం: మహేశ్ భగవత్**



రాష్ట్రంలో అక్కడక్కడ శాంతిభద్రతలు గాడి తప్పుతున్న వైనాన్ని లాఅండ్ ఆర్డర్ డీజీ మహేశ్ ఎం భగవత్ వివరణాత్మ ప్రజంటేషన్ ఇచ్చారు. ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకున్న ఘర్షణలు, రోడ్లపై దారుణ హత్యలు, ఆందోళనలు, వాటి నివారణపై చర్యలకు సీపీలు, ఎస్పీలను ఆదేశించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో ఏడీజీ అనిల్‌కుమార్, ఐజీలు వీ సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్, డీసీపీ శ్వేతారెడ్డి వివరించారు.

## ఓయూలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షల బహిష్కరణ

- సర్కారుపై కాలేజీల యాజమాన్యాల తిరుగుబాటు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయని ప్రభుత్వం
- గతంలోనూ పరీక్షల బహిష్కరణ

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు సర్కారుపై తిరుగుబాటు చేశాయి. డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించాయి. మంగళవారం ఓయూ పరిధిలో రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షలను యాజమాన్యాలు బహిష్కరించాయి. దీంతో సెంటర్ల వద్ద కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పరీక్షలకు వచ్చిన విద్యార్థులు టెన్షన్‌కు గురయ్యారు. విద్యార్థులకు నష్టం కలిగించొద్దని కొన్ని కాలేజీల్లో గంట ఆలస్యంగా పరీక్షలు జరుపగా, కొన్ని చోట్ల పరీక్షలు నిర్వహించలేదు. అటానమస్ కాలేజీలు, నాన్ దోస్త్ కాలేజీల్లో పరీక్షలు యథావిధిగా జరిగాయి.

**16 నెలలుగా పడిగాపులు..**

రూ.2,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిగ్రీ, పీజీ కాలేజీలు చాలాకాలంగా కోరుతున్నాయి. టోకెన్లు జారీ అయిన రూ.800 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరుతున్నాయి. 16 నెలలుగా పడిగాపులు కాస్తున్నాయి. సర్కారు తీరును నిరసిస్తూ కాలేజీల యాజమాన్యాలు ఇందిరాపార్కులో ధర్నా సైతం నిర్వహించాయి. 2024 అక్టోబర్‌లో సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చలు జరిపి త్వరగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అయినా కాలేజీల యాజమాన్యాలకు నిరాశే మిగిలింది. ఇప్పటి వరకు 20శాతం బకాయిలు కూడా విడుదల కాలేదు. మార్చి 31లోపు ఇవ్వకపోతే పరీక్షలు బహిష్కరిస్తామని అల్టిమేటం జారీచేసిన క్రమంలోనే బహిష్కరించాయి.



పింఛన్ల పెంపుపై ఎమ్మెల్యే భూపతిరెడ్డిని నిలదీస్తున్న మహిళలు

## పింఛన్ల సంగతేమైంది?

సారంగాపూర్, ఏప్రిల్ 8: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మంగళవారం స్వగ్రామంలోనే నిరసన సెగ తగిలింది. నిజామాబాద్ మండలంలోని గుండారం, జలాల్‌పూర్‌లో నిర్వహించిన సమావేశాల్లో మహిళలు వేదిక వద్దకు దూసుకొచ్చి కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ఇంకెప్పుడు ఇస్తారని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. 'రెండు నెలలు ఓపిక పట్టండి.. అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు ఇస్తాం' అని ఎమ్మెల్యే సర్దిచెప్పబోయారు. స్వగ్రామంలో తాగునీటి సమస్యలపై మహిళలు నిలదీయగా సమస్యను వెంటనే పరిష్కరించాలని అక్కడున్న అధికారులకు భూపతిరెడ్డి సూచించారు.